# బంగారం.. ఇంకాస్త తగ్గొచ్చు

● రిద్ధీసిద్ధీ బులియన్స్ ఎండీ పృథ్వీరాజ్ కొఠారీ అంచనా ● రాష్ట్రంలో ఇ-కాయిన్స్ లావాదేవీలు మొదలు

ఈనాడు - హైదరాబాద్

అమెరికాలో పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్ల వైపు మళ్లుతున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా బంగారానికి గిరాకీ కొంత తగ్గిందని, తత్ఫలితంగా ధర తగుముఖం పట్టిందని రిద్ధీసిద్ధీ బులియన్స్ మేనేజింగ్ డైరెక్టరు పృథ్వీరాజ్ కొఠారీ అన్నారు. ఔన్సు బంగారం అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం 1540 డాలర్ల ధర పలుకుతోంది. అదే దేశీయ విపణికి వచ్చేసరికి 10 గ్రాముల బంగారం (24 క్యారెట్లు) రూ.29,450 ధర ఉంది. అంతర్జాతీయంగా మారుతున్న సమీకరణలను బట్టి రెండు మూడు నెలల వ్యవధిలో ఔన్సు బంగారం ధర 1450 డాలర్ల వరకు దిగివచ్చే అవకాశం లేకపోలేదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ తరువాత మళ్లీ పెరుగుతుందని పేర్కొన్నారు. దేశీయ మార్కెట్‌లో మాత్రం భిన్నమైన పరిస్థితి ఉంటుందని అంచనా వేశారు. డాలర్‌తో పోల్చినపుడు రూపాయి మారకం విలువ తగ్గిపోతోంది. ప్రస్తుతం డాలర్- రూపాయి మారకం విలువ రూ.55 వరకు ఉంది. ఇది ఇంకా క్షీణించి రూ.60 కావచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. తత్ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర పతనం అయినంతగా దేశీయ మార్కెట్లో తగ్గలేదు. ఇంకా అయితే రూ.28,000 వరకు తగ్గవచ్చని, అంతకు మించి దేశీయ మార్కెట్లో బంగారం ధర తగ్గిపోవడానికి అవకాశం కనిపించడం లేదని పృథ్వీరాజ్ కొఠారీ అన్నారు. పెట్టుబడికి మున్ముందు బంగారం కన్నా వెండి ఆకర్షణీయంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం వెండి కిలో రూ.52,000 వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి కిలో రూ.50,000- 48,000 ధరలో దొరికితే కొనుగోలు చేయవచ్చన్నారు.



## ఆన్‌లైన్ వ్యాపారం

ఆభరణాల వర్తకుల కోసం 'ఆర్ఎస్‌బీఎల్ ఇ-కాయిన్స్' అనే ఆన్‌లైన్ ట్రేడింగ్ విధానాన్ని రిద్ధీసిద్ధీ బులియన్స్ రాష్ట్ర విపణిలో ఆవిష్కరించింది. దీని ప్రకారం వర్తకులు రిద్ధీసిద్ధీ బులియన్స్ ఆన్‌లైన్ వర్తక పోర్టల్‌లో ఖాతా ప్రారంభించి ఒక గ్రాము నుంచి 20 గ్రాముల వరకు బంగారం క్రయవిక్రయాలు నిర్వహించవచ్చు. దీనిపై ఎటువంటి ఛార్జీలు ఉండవు. ఇది నగల వర్తకులకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందని ఇ-కాయిన్స్ ట్రేడింగ్ సదుపాయాన్ని ఇక్కడ ప్రారంభించిన సందర్భంగా పృథ్వీరాజ్ కొఠారీ వివరించారు. బంగారం కొనుగోలు చేసిన వారు రెండు రోజుల్లో తమ అధీకృత డీలర్ వద్ద డెలివరీ తీసుకోవచ్చని తెలిపారు. బ్యాంకుల వద్ద, వేరోచోట్ల బంగారాన్ని కొనుగోలు చేస్తే ఛార్జీలు ఎంతో అధికంగా ఉంటాయని, దీనికి బదులు తమ వద్ద ఇ-కాయిన్స్ కొనుగోలు చేస్తే ఎటువంటి ఛార్జీలు తీసుకోం అన్నారు. తమ వద్ద నమోదైన రిజిస్టర్డ్ వర్తకుల ద్వారా రిటైల్ వినియోగదార్లు కూడా 1 నుంచి 20 గ్రాముల వరకూ బంగారాన్ని కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ సదుపాయాన్ని రెండేళ్ల క్రితం మహారాష్ట్రలో ప్రారంభించినట్లు, అక్కడ విజయవంతం అయిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## త్వరలో ఆభరణాల వ్యాపారంలోకి..

ఇంతకాలం బులియన్ వ్యాపారానికే పరిమితమై ఉన్న రిద్ధీసిద్ధీ బులియన్ త్వరలో ఆభరణాల వ్యాపారంలోకి సైతం ప్రవేశించనుంది. ఈ నెలాఖరులో ముంబాయిలో రెండు చోట్ల షోరూమ్‌లు ప్రారంభిస్తున్నట్లు కొఠారీ వెల్లడించారు. పరిస్థితులను బట్టి తదుపరి నెమ్మదిగా జ్యువెల్లరీ వ్యాపారంలో విస్తరించాలనేది తమ ఆలోచనగా చెప్పారు. స్టాక్‌మార్కెట్లో నమోదు కాని సంస్థ అయిన రిద్ధీసిద్ధీ బులియన్ ఏటా 5 బిలియన్ డాలర్ల టర్నోవర్‌ను నమోదు చేస్తోంది. జ్యువెల్లరీ వ్యాపారాన్ని వచ్చే రెండు మూడేళ్ల పాటు విస్తరించి తరువాత స్టాక్ మార్కెట్లో నమోదు కావాలనే ఆలోచన తమకు ఉన్నట్లు కొఠారీ తెలిపారు.